
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 5 డిసెంబరు 2024

9న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

గుజరాతీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గార మండలం వమరవల్లిలోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ కళాశాల(డైట్)లో ఈ నెల 9న జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వోకల్ మ్యూజిక్, ఇన్స్ట్రుమెంట్ మ్యూజిక్, డ్యాన్స్, థియేటర్, విజువల్ ఆర్ట్స్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్‌లో పోటీలు జరుగుతాయి. 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. మరిన్ని వివరాలకు డైట్ కళాశాల బోధనా సిబ్బందిని లేదా 94918 13995 నెంబర్‌లో సంప్రదించాల'ని డీఈవో సూచించారు.

ఆ మొక్కలు ఏమయ్యాయి?

- జిల్లాలో అవినీతిమయంగా జగనన్న పచ్చతోరణం
- సంరక్షణ పేరిట నిధులు స్వాహా
- ఎక్కడా కానరాని పచ్చదనం

- ఇచ్ఛాపురం మండలంలో ఓ రహదారికి ఇరువైపులా గతంలో మొక్కలు పెంచినట్టు చూపారు. కానీ ఇప్పుడు అక్కడ మొక్కలు కనిపించడం లేదు. రికార్డుల్లో మాత్రం మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టినట్టు చూపారు. కాగా.. అసలు మొక్కలే సరిగా నాటకపోతే వాటిని ఎలా సంరక్షిస్తారని.. మొక్కల పేరిట వైసీపీ నేతలు నిధులు కాజేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- ఇచ్ఛాపురం మండలంలోనే కాదు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వం 'జగనన్న పచ్చతోరణం' పథకం కింద రహదారులకు ఇరువైపులా ఉపాధి హామీ పథకం నిధులతో మొక్కలు నాటి, సంరక్షణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపింది. కానీ గత ఐదేళ్లలో నాటిన చోట మొక్కలు కనిపించడం లేదు. రికార్డుల్లో మాత్రం ఇంకా బతికే ఉన్నట్టు చూపారు. పెద్ద మొత్తంలో డ్రా చేసిన నిధులన్నీ అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లిపోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బాలకృష్ణాపురం రోడ్డులో బతికిఉన్న ఒకే ఒక్క మొక్క.



బొద్దకాళ రోడ్డులో కనిపించని మొక్కలు..

ఇచ్ఛాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో మొక్కల పెంపకం అక్రమార్కులకు కాసులు కురిపించింది. మొక్కలు నాటడం, సంరక్షణ బాధ్యతల పేరిట కోట్లాది రూపాయలు గోల్‌మాల్ అయ్యాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం పథకం ప్రారంభించింది. ఈ పథకం కింద రోడ్డు కిరువైపులా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చింది. 2019 నుంచి 2022 మధ్య జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేసింది. దాదాపు 2,500 కిలోమీటర్ల మేర.. 10 లక్షలు మొక్కలు నాటినట్టు స్పష్టం చేసింది. కేవలం వాటి సంరక్షణకే దాదాపు రూ.10 కోట్లకుపైగా వెచ్చించారు. అయితే ఇంత ఖర్చు చేసినా ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు. కనీసం వాటి ఆనవాళ్లు తెలియడం లేదు. అయినా నిర్వహణ పేరిట (మిగతా 6వ పేజీలో...)

మొక్కుబడిగానే..



కీర్తిపురం పంచాయతీలో అక్కడక్కడ మొక్కుబడిగా మొక్కలు నాటారే తప్ప పూర్తిస్థాయిలో నాటలేదు. నాటిన మొక్కలు చాలా వరకు పాడైపోయాయి. అధికారులు పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపకపోవడంతో మొక్కలు ఎక్కడా కనిపించటం లేదు.

-గిన్ని బాలరాజు, కీర్తిపురం

సంరక్షణ లేదు..



ఇచ్ఛాపురం మండలం పాయితారి, కీర్తిపురం, కొళిగాం పంచాయతీల్లో మొక్కలు నాటారే తప్ప.. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోలేదు. దీంతో చాలా మొక్కలు పాడైపోయాయి. కొన్నిచోట్ల పశువులు, మేకలు తినేయటంతో మొక్కలు కనిపించటం లేదు. పాడైన మొక్కల స్థానంలో కొత్తవి నాటితే బాగుంటుంది.

-లోపింటి పద్మనాభం, పాయితారి, టీడీపీ నాయకుడు

కొత్తవి నాటుతాం..

ఉపాధిహామీ పథకంలో బాగంగా మొక్కలు పెంచాం. చాలాచోట్ల మొక్కలు చనిపోయాయి. మరికొన్ని చోట్ల సంరక్షణ లేక వాడిపోయాయి. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటాం.

-సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధి ఏపీడీ, ఇచ్ఛాపురం

కస్టోడియన్లకు శిక్షణ ఎందుకివ్వలేదు?

- రైతులకు ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు
- మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ మన్‌జీర్ జిలానీ హెచ్చరిక
- జిల్లాలో రైతుసేవా కేంద్రాలు, మిల్లుల ఆకస్మిక తనిఖీ



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ మన్‌జీర్

ఆమదాలవలస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠినచర్యలు తప్పవని మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ మన్‌జీర్ జిలానీ హెచ్చరించారు. కస్టోడియన్లకు శిక్షణలో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లాలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో ఆయన పర్యటించారు. బూర్జ మండలంలోని డొంకలపర్త, పెద్దపేట రైతు సేవా కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. డొంకలపర్తలోని రైస్‌మిల్లులను కూడా తనిఖీ చేశారు. ధాన్యం తూనికలో తేడా వస్తే కఠినచర్యలు తప్పవన్నారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆరా తీశారు. అలాగే సరుబుజ్జిలి మండలం గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలో శ్రీహరిపురంలో సుందర్ రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లకు చేరే వరకు అక్కడ నుంచి మిల్లింగ్ అయిన బియ్యం.. పౌరసరఫరాల శాఖకు చేరే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కస్టోడియన్‌కు ఎందుకు శిక్షణ ఇవ్వలేదని ప్రశ్నించారు. మిల్లర్లకు గన్నీలు ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఈ విషయంలో ఏఎస్ టెక్నికల్ శ్రీనివాసరావును ఎందుకు సస్పెండ్ చేయకూడదో వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కస్టోడియన్ వీఆర్‌వో అప్పారావు వాహనం ఒకటి.. ట్రక్ షీట్ వేరొకటి నమోదు చేయడంపై ప్రశ్నించగా తనకు ఇదే మొదటిసారి అని ధాన్యం కొనుగోలులో తనకు అవగాహన లేదన్నారు. పౌరసరఫరాల శాఖ డీఎంగా పనిచేసిన శ్రీనివాసరావు స్థాయి తగ్గడంతో కనీసం ఏ ఒక్క కస్టోడియన్‌కు శిక్షణ అందించలేదని, నెల రోజుల క్రితం జరిగిన సమీక్షలో ఆయన వ్యవహారశైలిపై హెచ్చరించినా తీరు మారలేదని, ఇంకోసారి ఇటువంటి తప్పు జరిగితే సస్పెండ్ చేస్తామని డీఎం పేర్కొన్నారు. టెక్నికల్ అధికారులకు కూడా శిక్షణ ఇవ్వకపోవడంపై మార్క్‌ఫెడ్ ఎమ్‌డీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి అన్నదాతలకు ఉపయోగపడేలా రైతు సేవా కేంద్రాల సిబ్బంది వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సివిల్ సప్లయిస్ డీఎం వేణుగోపాల్, తహసీల్దార్ రాంబాబు, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పండగ

- 7న నిర్వహణకు ఏర్పాట్లు
- ప్రతీ పాఠశాలకు నిధులు మంజూరు



అంబుగాం ప్రభుత్వ పాఠశాల

హరిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సహృద్భావ వాతావరణం కల్పించేందుకు విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఓ వేదికపైకి చేర్చి.. విద్యాపరమైన అంశాలు చర్చించడంతోపాటు, ఆటపాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందజేయనుంది. మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు శుభతిథి పేరిట పాఠశాలల్లో ఈ నెల 7న ఈ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,638 పాఠశాలల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. దీనికోసం ప్రభుత్వం సుమారు రూ.55లక్షలు నిధులు విడుదల చేసింది. పదిమంది లోపు పిల్లలున్న బడులకు రూ.వెయ్యి, 300 నుంచి 400 మంది ఉంటే రూ.5వేలు, ఇలా సంఖ్యను బట్టి నిధులు కేటాయించింది. సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు, ఇతర విద్యాశాఖాధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

ప్రత్యేక ప్రణాళిక

తల్లిదండ్రుల కమిటీల సమావేశాలు నిర్వహణ కొత్త కానప్పటికీ.. ఈ సారి పలు ప్రత్యేకతలు జోడించారు. పిల్లల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులు కేటాయించారు. పూర్వ విద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు మరికొంత సేకరించి ఎవరిస్థాయిలో వారు కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ పర్చేజ్, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, ఇతర ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలను నియమించారు.

సమగ్ర వివరాలతో నివేదిక..

సమావేశం జరిగే రోజు పిల్లల ప్రగతి నివేదికను తల్లిదండ్రులకు అందజేస్తారు. ఈ కార్డుల్లో విద్యార్థుల మార్కులు, హాజరు వివరాలతోపాటు ఆటలు, సాంస్కృతిక ఇతరత్రా రంగాల్లో కనబరిచిన ప్రతిభ.. ఆరోగ్యపరంగా ఎత్తు బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి ఉంటే ఆ వివరాలు పొందుపరుస్తారు. ఇళ్ల వద్ద పిల్లలు సెల్‌ఫోన్, ట్యాబ్‌లు ఎక్కువగా వినియోగించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అలాగే తల్లులకు రంగోళి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులను సైతం వేడుకలకు ఆహ్వానిస్తారు.

విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు



ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో విద్యార్థుల్లో సేవాభావం, సమాజంపై గౌరవం పెరిగి వారిలో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయి. ఈ కార్యక్రమంతో విద్యార్థులు, తల్లిదండ్రులకు గ్రామంలో పాఠశాలపై ఆసక్తి పెరిగి.. అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తారు.

- ఆర్.రుక్మాంగదరావు, ఉపాధ్యాయుడు, జీఎంపురం హైస్కూలు, కంచిలి

మన పాఠశాలను మనమే రక్షిద్దాం



ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. గత ప్రభుత్వంలో 'నాడు-నేడు' కింద నిర్మాణాలు చేపట్టినా .. పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో ప్రజల్లో ఆలోచనా విధానాల్లో మార్పు వచ్చి మన పాఠశాలను మనమే రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వస్తున్నారు.

- కె.సురేష్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్, హరిపురం

కాంపోనెంట్ పనుల్లో వేగం పెంచాలి

- డ్వామా పీడీ సుధాకరరావు

శ్రీకాకుళం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మెటీరియల్ కాంపోనెంట్ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్(డ్వామా) బి.సుధాకరరావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం బైరి గ్రామంలో పర్యటించిన ఆయన గోకులం, సిమెంట్ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 3,303 సిమెంట్ రహదారి పనులు, 437 సీసీ కాలువల పనులకు రూ.276.54 కోట్లు నిధులు మంజూరు అయినట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో 90శాతం పైగా పనులు జరుగుతున్నాయని.. మిగిలిన పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఫిష్ పాండ్స్, ఫారం పాండ్స్, ఇంకుడు గుంతల పనులు, పెర్కులేషన్ ట్యాంకులు, గోకులాలు తదితర పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రారంభించిన ప్రతి పని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులకు నిధులు కొరత లేదని, ప్రతి గురువారం బిల్లుల నమోదు చేసి శుక్రవారం చెల్లించేలా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీవో సీతారాం, జేఈ పి.బాలముకుంద బాబు, టీఏ రత్నాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

సమగ్ర దర్యాప్తుతో కేసులు ఛేదించాలి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సమగ్రమైన దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులు త్వరితగతిన ఛేదించి రికవరీ చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ఎస్పీ వర్చువల్‌లో పోలీసు అధికారులతో సమీక్షించారు. లోక్ అదాలత్ కేసులు, ఎస్సీ ఎస్టీ, పోక్సో మహిళలపై దాడులు తదితర కేసుల పురోగతిపై ఆరా తీశారు. డిసెంబరు 14న జరిగే లోక్‌అదాలత్‌లో అధికశాతం కేసులు రాజీ అయ్యేలా చూడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం.. వాహనాలు నడిపినా, జూదం ఆడిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ సమీక్షలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎండల మల్లన్న ఆలయంలో అక్రమాలపై విచారణ

- ఉన్నతాధికారులకు నివేదిక: ఏసీ

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండలమల్లికార్జున స్వామి ఆలయంలో అక్రమాలపై దేవదాయశాఖాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల ఆలయంలో పలు అక్రమాలు జరిగాయంటూ బీజేపీ నాయకులు 'మీకోసం'లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. కార్తీకమాసంలో భక్తులకు ఉచిత దర్శనం కల్పించడం, ప్రసాదాల పంపిణీలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని బీజేపీ నాయకులు చిట్టిబాబికి లింగరాజు, ఎన్.లక్ష్మీనారాయణ, జనసేన నాయకుడు అనపాన జనార్దన రెడ్డి ఏసీ దృష్టికి తీసుకెళ్లారు. ఉచిత ప్రసాదాల పంపిణీ సక్రమంగా లేక భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారని, శీఘ్రదర్శనం టిక్కెట్లు రీ సైక్లింగ్‌తో ఆలయానికి ఆదాయం తగ్గిందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఆలయ అధికారులు వ్యవహరించారని వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏసీ ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ.. 'మీకోసం'లో వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. విచారణలో ఈవో గురునాథరావు, ఆలయ కమిటీ పూర్వ అధ్యక్షుడు ఎల్ఎల్ నాయుడు, మాజీ జడ్పీటీసీ లమ్మత లక్ష్మి, వివిధ ఆలయాల ఈవోలు వెంకటరమణ, ప్రభాకర రావు, కార్యదర్శి రవికుమార్, వీఆర్వో అప్పన్న, అర్చకులు రామకృష్ణ, యుగంధర్, మోహనరావు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న ఏసీ ప్రసాద్‌పట్నాయక్, అధికారులు

వితంతువులకు అండగా..

- ఇంటి యాజమాని మరణిస్తే.. వెంటనే పింఛన్
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం



నరసన్నపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

వితంతువులకు ఆర్థికంగా అండ కల్పించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఏదైనా కారణాలతో ఇంటి యజమాని మరణిస్తే మరుసటి నెలలోనే.. ఆయన భార్యకు వితంతువు పింఛన్ మంజూరు చేయాలని ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరి వితంతువులు నెలలు తరబడి ఎదురు చూడకుండా త్వరగా పింఛను నగదును అందజేయాలని నిర్ణయించింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులు మొత్తం 3,13,255 మంది ఉన్నారు. వీరిలో 74,027 మంది వితంతువులు ఉన్నారు. వీరికి సగటున రూ.30కోట్లకుపైగా పింఛన్ రూపంలో నగదు పంపిణీ చేస్తున్నారు. ఒక ఇంట్లో కుటుంబ యాజమాని ఆ నెలలో 15వ తేదిలోపే చనిపోతే, జీవిత భాగస్వామికి మరుసటి నెల ఒకటో తేదీన పింఛను ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక వేళ 15 నుంచి 30 వతేదీ లోపే మరణిస్తే ఒక నెల ఆలస్యంగా పింఛన్ ఇవ్వడానికి వివరాలు పంపాలని అధికారులను ఆదేశించింది. వితంతువు ఆధార్, భర్త మరణ ధ్రువీకరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు దరఖాస్తు అందించాలి. ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే అధికారులు పరిశీలన చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

పాత పద్ధతిలోనే..

టీడీపీ పాలనలో ఇదే విధానం అమలులో ఉండటంతో వితంతువులు పింఛను కోసం నిరీక్షించే పరిస్థితి ఉండేది కాదు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఊరట లభించేంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పద్ధతికి స్వస్తి పలికింది. ఇంటి యాజమాని ఏదైనా కారణంతో మరణిస్తే వితంతువు కోటాలో పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఆ తరువాత ఆరు నెలలు నుంచి ఎనిమిది నెలలు వరకు ఎదురు చూడాల్సి వచ్చేది. పైగా అధికార పార్టీ నాయకుల ద్వారా సిపార్సు చేసిన వారికే పింఛను మంజూరయ్యేది. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నెలలోపే వితంతువుకు పింఛను అందనుండడంతో వారికి ఆర్థిక భరోసా కల్పించినట్లు అవుతుంది.

పేరు మారలేదు..!



హరిపురంలో పేరు మార్చకుండా ఉన్న రైతుభరోసా కేంద్రం



జగన్ ఫొటోతో ఉన్న పాత సూచిక బోర్డు

హరిపురం/హిరమండలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రైతు సేవల కోసం రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పిడి చేసి ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా పలు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల పేరు మార్చ లేదు. పాత బోర్డులే దర్శనమిస్తున్నాయి. పేరు మార్పిడిపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తు న్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఇంకా అధికారులు వైసీపీ సేవలో తరిస్తున్నారన్న వాదనలు వస్తున్నాయి. పలు కేంద్రాల్లో అప్పటి సీఎం జగన్ బొమ్మలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నేటికీ అలానే ఉన్నాయి. మందస, హిరమండలం మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వ ఆదేశాలు పాటించడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అయితే పేరు మార్చేందుకు నిధులు లేవంటూ అధికారులు చెబుతుండడం కొసమెరుపు.



హిరమండలం: అంబావల్లి గ్రామంలో పేరు మార్చని రైతు భరోసా కేంద్రం

బంతి పూల సాగు.. లాభాలు బాగు



తండ్యాలపేటలో బంతిపూల సాగు..

- ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి
- ఆదర్శంగా నిలుస్తున్న తండ్యాలపేట రైతు

గార, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

రైతులు వరి, ఇతర పంటల సాగుతో పాటు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపుతున్నారు. శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేటకు చెందిన ఆదర్శరైతు తనకున్న మూడెకరాల పొలంలో ఎకర విస్తీర్ణంలో బంతి పూల సాగుచేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తమిళనాడు నుంచి తెప్పించిన 'వక్కల్ అంబట్లో' అనే బంతిరకం నారును సెప్టెంబరు రెండో వారంలో నాటించారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు ఆరు వేల ఎరుపు, పసుపు రంగులో ఉండే బంతి మొక్కలు నాటించి, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందిస్తున్నారు. మొక్కల మధ్య వరుసల్లో ముచ్చెలు ఏర్పాటు చేసి నీరు పొలంలో నిల్వ ఉండేలా ఏర్పాటు చేశారు. మొక్కలకి డ్రిప్ ద్వారానే ఎరువులు కూడా అందించారు. పొలం చుట్టూ పశువుల నుంచి రక్షణగా కంచె ఏర్పాటు చేశారు. రెండు నెలలు తర్వాత మొక్కలు పెరిగి బంతి పూలు కోతకు వచ్చాయి. అప్పటి నుంచి పూలను కూలీలతో కోయించడం ప్రారంభించారు. ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి కోత కోస్తుండగా.. కోసిన ప్రతిసారి వంద కిలోల బంతి పూలు దిగుబడి వస్తున్నాయి. వీటిని శ్రీకాకుళం నుంచి వచ్చిన వర్తకులకు కిలో రూ.140 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు.

ఉద్యాన పంటలపై ఆసక్తి..



మా పొలంలో ఇంత వరకు వరి, ఇతర పంటలు సాగుచేసేవాడిని. ఇతర జిల్లాల్లో రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలపై ఆసక్తి కలిగింది. ఇందులో భాగంగా బంతిపూలు సాగు చేస్తున్నాను. మిగిలిన పొలంలో జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలు కూడా సాగు చేస్తున్నాను. ఎకరాలో బంతిపూల సాగు కోసం సుమారు రూ.లక్ష పెట్టుబడి అయింది. ఎకరాకు సుమారు టన్ను పూలు దిగుబడి వస్తాయని.. బంతి సాగు వల్ల మంచి ఆదాయం వస్తుందని భావిస్తున్నాను.

-గొలివి భాస్కరరావు (రైతు), తండ్యాలపేట

520 ఎకరాల్లో పశుగ్రాసాల పెంపకం లక్ష్యం

- పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ జయరాజ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



టెక్కలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

డివిజన్ పరిధిలో 520 ఎకరాల్లో బహువార్షిక పశు గ్రాసాల పెంపకం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.వి. జయరాజ్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

- **ప్రశ్న:** డివిజన్‌లో బహువార్షిక పశుగ్రాసాల పెంపకం జరుగుతోందా?
- **జవాబు:** ఎన్ఆర్ఈజీఎస్ పథకం లింకుతో అమలు చేస్తున్నాం. పది సెంట్లు మొదలు కొని 50 సెంట్లు వరకు పశుగ్రాసాల పెంపకంపై రైతులను ప్రోత్సహిస్తున్నాం. తద్వారా పాల దిగుబడి పెంచే దిశలో చర్యలు తీసుకుంటున్నాం. 50 సెంట్లు పశుగ్రాసం సాగు చేసే వారికి రూ.30 వేల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే డివిజన్‌లో 80మంది రైతులను గుర్తించాం.
- **ప్ర:** పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తున్నారా?
- **జ:** పాడి రైతులకు సంబంధించి 8 వేల కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వడం లక్ష్యం కాగా ఇప్పటికే 5,224 మందికి అందజేశాం. పాలు అమ్మకాలు చేస్తున్నట్లు పశు వైద్యులు ధ్రువీకరించాల్సి ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డు కింద వాడుకున్న వారికి కేవలం పావలా వడ్డీ మాత్రమే.
- **ప్ర:** పశుగణన ఎలా సాగుతోంది?
- **జ:** డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 1,08,000 ఇళ్లకు గాను 36 శాతం పశుగణన పూర్తి చేశాం. ఫిబ్రవరి 28 వరకు 109 మంది ఎన్యూమరేటర్లతో ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం.
- **ప్ర:** ఆడదూడలకు బ్రూసెల్ ఓసిస్ వ్యాక్సినేషన్ చేపడుతున్నారా?
- **జ:** ఆడదూడలకు జీవితకాలం అబార్షన్ కాకుండా ఉండేందుకు నాలుగు నెలలు దాటే దూడలకు బ్రూసెల్ ఓసిస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతోంది. ఇప్పటికే 6,400 ఆడదూడలకు వ్యాక్సినేషన్ చేశాం.
- **ప్ర:** గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందు సరఫరా జరిగిందా?
- **జ:** డివిజన్ పరిధిలో ఐదు లక్షల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ డోసులు వేశాం. రాష్ట్రంలోనే టెక్కలి డివిజన్ మొదటి స్థానంలో ఉంది.
- **ప్ర:** మేకల్లో అమ్మవారి జబ్బుకు ఏ రకమైన చర్యలు తీసుకుంటున్నారు?
- **జ:** మేకల్లో అమ్మవారి జబ్బు రాకుండా గోట్ వ్యాక్సినేషన్ 15 వేల డోసులు సిద్ధం చేశాం. ప్రతి మండలానికి వెయ్యి చొప్పున అందిస్తాం.
- **ప్ర:** ఖాళీగా ఉన్న పశువైద్యుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారా?
- **జ:** టెక్కలి డివిజన్‌లో 44 మంది పశు వైద్యులకు గాను 17 ఖాళీలున్నాయి. 8 మంది ఏడీ పోస్టు లకు గాను రెండు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీల విషయం ఉన్నతాధికారులకు నివేదించాం.



మాట్లాడుతున్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ గోపాల్

మిల్లర్లు, కార్మికుల మధ్య చర్చలు విఫలం

పలాస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వేతన ఒప్పందం విషయమై రైస్‌మిల్లర్లు, కార్మి కుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇరు సంఘాల నాయకులు పలాస రైస్‌మిల్లులో బుధవారం సమావేశమయ్యారు. 2022-24 సంవత్సరాలకు సంబంధించి వేతన ఒప్పంద కాలపరిమితి ముగియడంతో కొత్త వేతనం కోసం చర్చలు చేపట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో పెంచిన వేతనాలపై 40 శాతం అదనంగా ఇవ్వాలని కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి కోరారు. రెండు నెలల కిందటే వేతనాలు పెంచాలని లేఖ అందించామన్నారు. దీనికి వ్యాపారులు అంగీకరించలేదు. ప్రస్తుతం వ్యాపారం సంక్షోభంలో ఉందని, అంత మొత్తంలో పెంచితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇరువర్గాల మధ్య వాదనలు జరిగాయి. సమయం మించి పోవడంతో వారం రోజుల్లో మళ్లీ చర్చల ద్వారా వేతనాలు నిర్ణయించడం జరుగుతుందని ప్రకటించి సమావేశం ముగించారు. సమావేశంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డోకి రామారావు, ప్రధాన కార్యదర్శి కేవీ గోపాల్, కోశాధికారి సిందిరి కిషోర్, కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు బొంపల్లి సింహాచలం, ప్రధాన కార్యదర్శి సాన ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వెయిట్ పెంచేలా!

- వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న దూబ హేమశ్రీ
- సౌత్ జోన్ పోటీల్లో బంగారు పతకం



వెయిట్ లిఫ్టింగ్ సాధన చేస్తున్న దూబ హేమశ్రీ

ఎచ్చెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

వెయిట్ లిఫ్టింగ్ పేరు చెప్పగానే కరణం మల్లీశ్వరి, పూజారి శైలజల పేర్లు ప్రధానంగా ప్రస్తావనకు వస్తాయి. వారిని స్ఫూర్తిగా తీసుకుని.. తండ్రి ప్రోత్సాహం... గురువు మార్గదర్శకంతో జిల్లాకు చెందిన ఓ మహిళ వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తోంది. గార మండలం బూరవిల్లి గ్రామానికి చెందిన దూబ హేమశ్రీ శ్రీకాకుళంలోని ఓ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరపున దూబ హేమశ్రీ సౌత్ జోన్ యూనివర్సిటీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు)లో ఇటీవల జరిగిన సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ (మహిళల) -2024లో పోటీల్లో 55 కిలోల విభాగంలో హేమశ్రీ బీఆర్ఏయూ తరపున పాల్గొని విజయం సాధించింది. అంబేడ్కర్ యూనివర్సిటీ చరిత్రలో బంగారు పతకం రావడం ఇదే ప్రథమం. ఈ పోటీలకు మేనేజర్‌గా వర్సిటీ పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, కోచ్‌గా శాప్ ప్రతినిధి ఐ.అప్పన్న వ్యవహరించారు.

ఐదేళ్లుగా సాధన..

డిగ్రీ సంవత్సరం చదువుతున్న హేమశ్రీ గత ఐదేళ్లుగా వెయిట్ లిఫ్టింగ్‌లో సాధన చేస్తోంది. ఆమె తండ్రి దూబ రాంబాబు ప్రోత్సాహంతో వెయిట్ లిఫ్టింగ్‌పై దృష్టి సారించానని చెబుతోంది. ఇప్పిలి అప్పన్న (పెద్దపాడు) వద్ద మెలకువలు నేర్చుకుంటోంది. గత ఏడాది రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించి, హిమాచలప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది.

అంతర్జాతీయ స్థాయిలో పేరు సాధిస్తా..

సౌత్ జోన్ స్థాయిలో బంగారు పతకం సాధించాను. వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకం సాధించేలా కృషి చేస్తాను. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా పేరును ఇనుమడింపజేసేందుకు ప్రయత్నిస్తాను.

-దూబ హేమశ్రీ



హేమశ్రీని అభినందిస్తున్న వీసీ తదితరులు

క్రీడల్లో రాణించాలి..

క్రీడల్లో రాణించి వర్సిటీ పేరును ఇనుమడింపజేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు)లో ఇటీవల జరిగిన సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురు క్రీడాకారిణిలను బుధవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలోనే తొలిసారి డి.హేమశ్రీ బంగారం పతకం సాధించడం అభినందనీయమన్నారు. అలాగే హిమాచల్‌ప్రదేశ్‌లో త్వరలో జరగనున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జి.వర్షిత, ఎస్.ఝాన్సీలక్ష్మిని సత్కరించారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్, పీడీ ఎం.శ్రీనివాసరావు, కోచ్ ఐ.అప్పన్న పాల్గొన్నారు.

తిరుపతిలో అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దేవస్థానం పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు సందర్భంగా నగరానికి చెందిన లయశ్రీ నృత్య కళా నికేతన్ అధ్యక్షురాలు కె.పరిమళ హరిహర్, తన శిష్య బృందం నృత్య నీరాజనం సమర్పించారు. అమ్మవారి మాడవీధిలో కె.పరిమళ హరిహర్, జ్ఞాన ప్రసన్న, స్వాతిసత్య, శ్రీహయశస్విని, పుష్పచందన, శ్రావణి, ఝాన్సీలక్ష్మి, దీక్షణ సాయి, శరణ్య దివిజశ్రీ స్వామి వారి పువ్వుల పల్లకినీ పట్టి నృత్యం చేస్తూ ఆకట్టుకున్నారు.



ఆ మొక్కలు ఏమయ్యాయి?

(ఐదో పేజీ తరువాయి)

నిధులు ఖర్చుపెట్టినట్టు ఫైళ్లలో చూపించారు. వాస్తవానికి సరిగ్గా నిర్వహణ చేపడితే 85 శాతం మొక్కలు బతకాలి. ఒక వేళ మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తవి నాటాలి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో అటవీ శాఖ నర్స రీల నుంచి లక్షల మొక్కలు తెచ్చారు. మిగిలిన వాటిని ప్రైవేటు నర్సరీల నుంచి సేకరించారు. ఇలా మొక్కల కొనుగోలు, ట్రీగార్డులు, వాటి సంరక్షణకు ఏడాదిలో సుమారు రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు.

● నిధుల గోల్‌మాల్..

జగనన్న పచ్చతోరణం పథకం కింద మొక్కల కొనుగోలు సమయంలో భారీ అవినీతి జరిగింది. ఈ బాగోతంలో కింది స్థాయి సిబ్బంది నుంచి జిల్లా అధికారుల వరకూ భాగస్వామ్య మయ్యారు. వాస్తవానికి 6 అడుగుల ఎత్తు, రెండేళ్ల వయసున్న మొక్కలనే నాటాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఎక్కడా ఆ పొడవు ఉన్న మొక్కలను నాటలేదు. 3 నుంచి 4 అడుగుల పొడవు ఉన్న మొక్క లను కొనుగోలు చేసి నాటారు. కానీ 6 అడుగుల మొక్కను కొనుగోలు చేసినట్టు చూపారు. ఒక్కో మొక్క రూ.98కి కొనుగోలు చేసినట్టు చూపారు. రూ.20 చొప్పున కమీషన్ తీసుకుని కోటి రూపాయల వరకూ స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి.

● ఇలా చెల్లించారు..

ఉపాధిహామీ పథకంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టారు. ఒక్కో మొక్క కోసం గొయ్యి తీసేందుకు రూ.52.90, రవాణాకు రూ.3, అంతర్గత రవాణాకు రూ.2.30, నాటేందుకు రూ.9.12, కంచె కట్టేందుకు రూ.140 ఖర్చు చేసినట్టు చూపించారు. ఎరువు వేసేందుకు, నీళ్లు పోసేందుకు అదనపు ఖర్చులు చేశారు. అయితే రోడ్డు విస్తరణ చేపట్టిన చోట సైతం మొక్కలు నాటామని లెక్కల్లో చూపడం విశేషం. దీనిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశముందని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

చినుకు పడితే చిత్తడే!

- రూ.కోట్లలో ఆదాయం.. సౌకర్యాలు అధ్వానం
- ఇదీ ఆదిత్యాలయంలో పరిస్థితి

అరసవల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం ఒకటి. ఈ ఆలయానికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా పరిశుభ్రత మాత్రం ఆశించిన స్థాయిలో కానరావడం లేదు. దీంతో స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులు ఇబ్బందిపడుతున్నారు. కానీ ఆలయ పరిసరాల్లో మాత్రం శుభ్రత శూన్యం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకుని, ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. గతంలో గత వైసీపీ ప్రభుత్వం ఇంద్ర పుష్కరిణి అభివృద్ధి పేరిట శంకుస్థాపన చేసిన తర్వాత పుష్కరిణిలో నీటిని తోడేసి బయటకు వదిలేశారు. సకాలంలో పనులు ప్రారంభించకపోవడం.. అనంతరం వర్షాల వల్ల, కాలువ నీటితో నిండిపోయింది. ఆ నీరు స్నానాలకు కూడా ఉపయోగపడకపోవడంతో కాళ్లు, చేతులు కడుగుకుని, నీళ్లను తలపై చల్లుకుని స్వామివారి దర్శనానికి వెళుతున్నారు. ఇదిలావుంటే రెండు రోజుల కిందట కురిసిన చిన్నపాటి వర్షానికే ఇంద్ర పుష్కరిణి ప్రాంతం బురద మయంగా మారింది. కనీసం నడవడానికి కూడా భక్తులు ఇబ్బందిపడ్డారు. ఇక పుష్కరిణిలో కాళ్లు, చేతులు కడుక్కుని, నీళ్లు తలపై చల్లుకోవడానికి కూడా భక్తు లు వెళ్లలేని దుస్థితి నెలకొంది. పుష్కరిణి పరిసరాలు అధ్వానంగా మారడంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు. స్వామి వారికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా కనీస వసతులకు కూడా కల్పించక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.



రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి బురదమయమైన ఇంద్రపుష్కరిణి ప్రాంతం

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు అడ్డంగా చెట్ల కొమ్మలు తొలగించేందుకు, ఇతర మరమ్మతుల కోసం ఎచ్చెర్లలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫరీద్‌పేట ఫీడర్, ఫరీద్‌పేట, లింగాలపేట, ఎస్ఎం పురం గ్రామాలకు శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

● గార డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తూలుగు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో బూరవెల్లి, అంబల్లవలస, కొర్ని, కొర్లాం, తూలుగు, ఆమదాలపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

అవగాహన కల్పించాలి

గార, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొల్లివలస వద్ద ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం కిశోర వికాసం పథకంలో భాగంగా బాలికల కోసం శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.రమణారావు మాట్లాడుతూ.. కిశోర బాలికలు చదివే పాఠశాలలు కళాశాలల్లో కిశోర్ వికాసంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రాధామాధవి, ఏసీడీపీవో తులసిలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

10న గణిత ఎగ్జిబిషన్

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జరగాల్సిన మండల స్థాయి గణిత ఎగ్జిబిషన్ మేళా ఎస్ఏ-1 పరీక్షల నేపథ్యంలో ఈనెల 10వ తేదీకి మార్పు చేయడం జరిగిందని ఎంఈవో కె.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంపీయూపీ బి.తోటూరు స్కూల్, ఎంపీఎల్‌పీ పంజాస్ట్రీట్ పాఠశాల సంయుక్తంగా నిర్వహించనున్న మేథ్స్‌డేలో మండలంలో ఉన్న అన్ని ప్రైమరీ స్కూల్స్ యూపీ స్కూల్స్ హైస్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

విద్యార్థులకు సంకల్పంపై అవగాహన

గుజరాతీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సంకల్పం పేరుతో పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు టూటౌన్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. నగరంలోని బలగ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులతో సంకల్పం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల వాడకంపై అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

గార, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కొర్ని గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ధర్మశాస్త్ర సన్నిధానంలో అయ్యప్ప భక్తులందరికీ మంచి జరగాలని వారి ఇంట సుఖసంతోషాలతో వెల్లివిరియాలన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు టీడీపీ నాయకులు భక్తులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కంచిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. జనవరి 8వ తేదీ వరకు 58 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో బుధవారం జరుగుతున్న రేషన్ పంపిణీని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, సీఎస్‌డీటీ కూర్మారావు పరిశీలించారు.

ఆటపాటతో కూడిన విద్యనందించాలి

జి.సిగడాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని ఎంపీడీవో టి.రామకృష్ణ అన్నారు. బుధవారం పెంట, నాగులవలస గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టి కాహారాన్ని లబ్ధిదారులకు సక్రంగా అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పొట్నూరు సురేష్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు మక్క విజయలక్ష్మి, సిగటాపు ఈశ్వరమ్మ, మక్క రూప, ప్రసన్న తదితరులు ఉన్నారు.

మల్చింగ్‌తో ప్రయోజనం

ఆమదాలవలస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో మల్చింగ్‌తో బహుళ ప్రయోజనాలు ఉంటాయని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. బుధవారం చేపేనపేట యూనిట్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో రబీ డ్రై షోయింగ్ పద్ధతుల్లో పంటల సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. రబీ డ్రై షోయింగ్ కంపాక్ట్ బ్లాక్‌లను రైతులతో చేయిస్తున్నట్టు తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవరావు ఉన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం

● ప్రతీ గింజా కొనుగోలు చేస్తాం

● 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు

● ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం/ఎచ్చెర్ల/రణస్థలం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మడ్డువలస, తోటపల్లి జలాశయాలు ద్వారా ప్రతీ ఎరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. బుధవారం పెంట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మిల్లులకు ధాన్యం పంపించిన 24 గంటల్లోనే రైతలు ఖాతాల్లోకి సొమ్ము జమచేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ప్రజలకు తాగునీరు, రైతులు సాగునీరు అందించడంతో పాటు గ్రామంలో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తుందన్నారు. అనంతరం రైతులకు ట్రిక్‌షీట్ అందజేసి ట్రాక్టర్ నడిపి ప్రారంభించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఏవో శారద, ఎంపీడీవో టి.రామకృష్ణ, ఈఏ కుసుమ కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రఘురాం, బూరాడ వెంకటరమణ, అర్జున్‌కుమార్, అప్పన్న మాస్టారు, మౌళీశ్వరరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు కుటుంబాలను పరామర్శించారు. ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌లో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏలు భవానీ శంకర్, రజని, తహసీల్దార్ సింహాచలం, ఎంపీడీవో హరిహరరావు, ఏవో వై.సురేష్, టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు. రణస్థలం మండలం పైడిభీమవరం పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ప్రారంభించారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైడి అప్పడదొర, గొర్లె లక్ష్మణరావు, రౌతు శ్రీనివాసరావు, పిషిని అసిరినాయుడు, తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, పీఏసీఎస్ సీఈవో గిరి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఎమ్మెల్యే దృష్టికి సర్పంచ్‌ల సమస్యలు



సమస్యలను వివరిస్తున్న దృశ్యం

రణస్థలం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సమస్యలను జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు పిన్నింటి భానుజీనాయుడు ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. వివిధ సమస్యలపై చర్చించారు. సర్పంచులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

రూ.12 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల కష్టకాలంలో ఉంటే తక్షణమే స్పందించి ఎమ్మెల్యే కూన రవికుమార్ అండగా నిలుస్తున్నారు. నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన పట్టా సూర్యనారాయణ అనే టీడీపీ కార్యకర్త గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆర్థిక ఇబ్బందులను ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పరిస్థితి వివరించారు. దీంతో రూ.12 లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే రవికుమార్ బుధవారం హైదరాబాద్ వెళ్లి ఆ కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాలు అందించారు.

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీల నియామకం



విలేఖరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కృష్ణారావు

అరసవల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఇన్‌చార్జీలను నియమించినట్టు డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు తెలిపారు. స్థానిక ఇందరా విజ్ఞాన్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాల్లో మరింత పార్టీ పటిష్ఠతకు నియోజకవర్గ ఇన్‌చార్జీలను ఏర్పాటు చేశామని, మున్ముందు మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో మానుపత్రి చక్రవర్తి రెడ్డి (ఇచ్ఛాపురం), మజ్జి త్రినాథబాబు (పలాస), దుంపల రామారావు (టెక్కలి), మామిడి సత్యనారాయణ (నరసన్నపేట), అంబటి కృష్ణారావు (శ్రీకాకుళం), బొచ్చ వెంకటరమణ (ఆమదాలవలస), మజ్జి మురళీమోహన్ (పాతపట్నం), ఆబోతుల వెంకట నాయుడు (ఎచ్చెర్ల) నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేయడమైనదన్నారు.

ఉత్సాహంగా గ్రిక్స్ పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సురంగి రాజా మైదానంలో బుధవారం మండల స్థాయి గ్రిక్స్ పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. అండర్-14 బాలురు విభాగంలో వాలీబాల్, కబడ్డీ, టెన్నీకాయిట్, బాలికల విభాగంలో ఖోఖో, టెన్నీకాయింట్, అండర్-17 బాలుర విభాగంలో కబడ్డీ, టెన్నీకాయిట్, బాలికల విభాగంలో ఖోఖో, టెన్నీకాయిట్, పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎంఈవో కె.అప్పారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభంరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మశ్రీ, సాజన్, గణేష్, రవి వజీర్, ధర్మరాజు, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజకు భారీసెట్



సరుబుజ్జిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రొట్టవలస గ్రామంలో బుధవారం అయ్యప్ప స్వామి పడిపూజకు భారీ సెట్టింగ్ వేశారు. ఆకట్టుకునేలా రూపొందించడంతో చూపరులు ఆసక్తి చూపారు. తాడేల గోవిందరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఈ గ్రామంలో 40 మంది అయ్యప్ప మాలధారణ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 250 మంది అయ్యప్ప, భవానీ భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రక్తహీనత సమస్యలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల్లో రక్తహీనత సమస్యలు ఎదురవుతున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీవో నాగరాణి అధ్యక్షతన కిశోరి వికాసంపై శిక్షణ నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ.. బాలబాలికలు సంబంధించిన చట్టాలు, సైబర్ క్రైంపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేశారు. న్యాయవాది ఎం.రాంబాబు, కొళిగాం పీహెచ్‌సీ వైద్యురాలు కల్యాణి, ఐసీపీఎస్ కోఆర్డినేటర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కంచిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పోలేరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో ధనుంజయ, టీడీపీ నాయకులు మాదిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు ఏర్పాట్లు



పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

అరసవల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారించాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం విజయవాడ రెవెన్యూ సదస్సుల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభల వివరాలు తెలియజేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఏవో సూర్యనారాయణ, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేయొద్దు

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జగన్మోహన్‌రావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రైస్ మిల్లర్లుతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు సూచించారు. గురువారం జీపీఎస్ డివైస్‌ను వాహనాలకు అమర్చడానికి టెక్నీషియన్స్ వస్తున్నారని, వాహనాలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో టి.భార్గవి, సీఎస్‌డీటీ సంతోష్, పీఏసీఎస్ సీఈవో, ఎఫ్‌పీవో సీఈవో పాల్గొన్నారు.

● కవిటి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరికోతల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. వరక గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ సీజన్‌లో రైతులు వేసే పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన, వ్యవసాయశాఖాధికారులు మాధవీలత, బి.దుర్గా ప్రసాద్, విస్తరణాధికారి బి.కల్యాణ్ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ

వరి పంటకు మొలకలు

పొందూరు/గార, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు చాలా గ్రామాల్లో కోత కోసిన వరి పంట తడిసి పోయి మొలకలు వస్తున్నాయి. పొందూరు మండలం బొడ్డేపల్లి, మొదలవలస, కింతలి, తోలాపి తదితర గ్రామాల్లో వరి పంటకు మొలకులు వచ్చాయి. చేతికి పంట అందే సమయంలో వర్షాలతో నష్టం రావడంతో రైతులు ఆందోళనం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పంటనష్టం అందించాలని టీడీపీ నాయకులు బి.సత్యం, ఎం.సీతారామరాజు తదితరులు అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. గార మండలం వత్సవలస, జాఫ్రాబాద్ తదితర గ్రామాల్లో వరి పనలు తడిసి మొలకలు వచ్చాయి.



గార: వత్సవలసలో మొలకలు వచ్చిన వరి చేను



పొందూరు: మొలకెత్తిన వరిపంట

ఆ రైస్ మిల్లుకు అనుమతివ్వొద్దు

● రైతులు, టీడీపీ నాయకులు వినతి



డీటీకి వినతి పత్రం అందిస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

కంచిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు ఎంపీపీకి చెందిన రైస్‌మిల్లుకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వొద్దని మండల టీడీపీ నాయకులు, రైతులు అధికారులను కోరారు. ఈ మేరకు మాదిన రామారావు, బంగారు కురయ్య, పైల పురుషోత్తం రెడ్డి తదితరులు రైతులతో కలసి బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీపీగా ఉన్న వ్యక్తి తన మిల్లు ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు డబ్బులు సక్రమంగా చెల్లించలేదని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రూ.200 తక్కువ చేసి చెల్లించారని ఆరోపించారు. అలాగే ఒడిశా నుంచి ధాన్యం తెచ్చి ఇక్కడ ప్రభుత్వానికి అమ్మకాలు జరిపి స్థానిక రైతుల కడుపుకొట్టారన్నారు. రైతులకు అన్యాయం చేసిన అటువంటి వ్యక్తికి చెందిన మిల్లుకు అనుమతులు ఎలా మంజూరు చేస్తారన్నారు. దీనిపై అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. పైల మన్మథరావు, మద్దిల కేశవయ్య, జి.మన్మథరావు, సనపల కామేష్, ఆనంద్, రమేష్ మహంతి, గోపి, వెంకటరమణ, అశోక్ తదితరులున్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఘంటసాల జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. కేరీర్ ఫెయిర్, సిక్కోలు, ఫ్యూచర్ సింగర్స్ సంస్థ అధ్యక్షుడు సాయి బాబా ఆధ్వర్యంలో చైతన్య కళాశాల (కోపరేటివ్) భవనంలో నిర్వహించారు. గాయకులు సాయిబాబా, మార్గదర్శి శ్రీనివాస్, కేఎల్ఎన్ మూర్తి తదితరులు ఘంటసాల గీతాలను ఆలపించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

న్యాయసేవా సదన్‌లో రివ్యూ



మాట్లాడుతున్న న్యాయాధికారి

గుజరాతీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో గల జిల్లా న్యాయ సేవాసదన్‌లో బుధవారం నెలవారీ రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు పాల్గొని గత నెలలో జరిగిన కార్యకలాపాలను చర్చించారు. గురువారం జరగనున్న లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. బుధవారం 16వ వార్డులో రామమందిరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు అకౌంట్ నెంబర్లు, పిన్ నెంబర్లు అడిగితే ఇవ్వరాదన్నారు. సైబర్ నేరగాళ్లు పంపించే లింకులపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేరాదన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తాగునీరు లేక అల్లాడుతున్నాం

● ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన కొత్తపేట మహిళలు



నీటి సమస్యను సూపరింటెండెంట్ మంగవాణికి వివరిస్తున్న మహిళలు

కోటబొమ్మాళి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో సుమారు నెలరోజులుగా తాగునీరు లేక అల్లాడుతున్నామని కొత్తపేట గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం మహిళలు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో 2019లో నిర్మించిన రక్షిత నీటి పథకం పనిచేయడం లేదని, ఆ ట్యాంకుకు లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతోందని, దీంతో బోరుబావులను వినియోగిస్తుంటే వాటి నుంచి వచ్చిన నీరు కలుషితమై పింపిరి వాసన వచ్చి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇదే సమస్యను అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ మంగరాణికి వినతిపత్రం అందించారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈతో మాట్లాడగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, అక్కడికి వెళ్లి పరిశీలించగా నీటి పథకం లీకేజీ వల్ల నీరు బయటకు పోతోందన్నారు. మరమ్మతుల కోసం నివేది కను పంచాయతీ అధికారులకు పంపామన్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవోకు తెలియజేసి మండల పరిషత్ నుంచి నిధులు సమకూర్చాలని కోరుతానని ఆమె వారికి హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

క్రైం కార్నర్

రాజు-రాణి ఎక్స్‌ప్రెస్ కింద పడి మేకలు మృతి



టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): లింగాలవలస గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం రాజు-రాణి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఏడు మేకలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన లండ అప్పారావు గొర్రెలు, మేకలను మేతకు తీసుకువెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో ఆయన లబోదిబోమంటున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు.

గంజాయి మొక్క స్వాధీనం



గంజాయి మొక్కను పరిశీలిస్తున్న పోలీసులు

హిరమండలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగీరథపురం కాలనీలో నివాసం ఉంటున్న ముఖలింగం ఇంటి పెరటిలో కొన్ని నెలలుగా గంజాయి మొక్క పెంచు తున్నాడన్న విషయం తెలుసుకుని దాడి చేసి మొక్కను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపారు. తహసీల్దార్ హనుమంతురావు సమక్షంలో మొక్కను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకుని కొత్తూరు కోర్టులో ప్రవేశ పెట్టామన్నారు. వారి ఆదేశాల మేరకు నిందితుడికి రిమాండ్‌కు తరలించా మన్నారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా, మొక్కలు పెంచినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడిలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఆర్ఐ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెళియాపుట్టి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు దవిడిగాం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోసమాళ గ్రామానికి చెందిన గొట్టిపల్లి శ్యామ్యూల్ (65) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్యామ్యూల్ గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై గ్రామానికి చెందిన సోనాపురం, గంగధర్‌తో కలిసి పర్లాకిమిడి వెళుతుండగా దవిడిగాం సమీపంలో పలాస నుంచి పర్లాకిమిడి వెళుతున్న ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. గంగాధర్ పర్లాకిమిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పర్లాకిమిడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్యామ్యూల్ 20 ఏళ్ల నుంచి టీడీపీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శ్యామ్యూల్ మృతికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి సంతాపం తెలిపారు.

రౌడీషీటర్‌కు 14 రోజుల రిమాండ్

శ్రీకాకుళంక్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ప్రజలను ఇబ్బంది పెడుతున్న రౌడీషీటర్‌కు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని కంద్రవీధికి చెందిన బొమ్మలాట హరికృష్ణ అనే రౌడీషీటర్ ప్రతిరోజూ మద్యం తాగి స్థానికులను ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు అందింది. దీనిపై ఎస్ఐ ఎం.హరికృష్ణ ఆ వీధిలో పర్యటించగా మద్యం మత్తులో హరికృష్ణ అక్కడి వారిపట్ల దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు అన్నారు. బుధవారం పూండిలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. డ్రగ్స్, ఈవ్ టీజింగ్ లాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండా లన్నారు. విద్యార్థి దశ ఉన్నతమైనదని, ఈ దశలో శ్రమించే వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుం దన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ లీల, ఎస్ఐ నిహార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పులి దాడిలో ఆవు మృతి



ఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు (ఇన్‌సెట్‌లో) పులి పాదముద్ర

ఒడిశా

పర్లాకిమిడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గజపతి జిల్లా గుసాని సమితి పరిధిలో కొన్ని రోజులుగా పెద్దపులి సంచ రించి ప్రజలకు భయ భ్రాంతులకు గురిచేస్తోంది. మంగళవారం గుసాని సమితిలో పలు ప్రాంతాల్లో పులి సంచరించి విధ్వంసం సృష్టించింది. పంట పొలాల్లో పులి పాద ముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికా రులు ప్రజలకు అప్రమత్తం చేసినప్పటికీ మంగళవారం అర్ధరాత్రి అందో రాజులి గ్రామంలో జాకబ్ సభరోకు చెందిన ఆవుపై పులి దాడి చేసి చంపేసింది. ఈ ప్రాంతాన్ని అటవీ శాఖ అధికారులు బుధవారం సందర్శించి ఆవుపై పులి దాడి చేసినట్లు నిర్ధారించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు.

ఘనంగా ఘంటసాల జయంతి



పర్లాకిమిడి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలు గు పాట ఉన్నంత కాలం ఘంట సాల వెంకటేశ్వ రరావు సజీవంగా ఉంటారని సమితి కార్యదర్శి బి. జనార్ధనరావు అన్నారు. పాతపట్నం రోడ్‌లో ని ఘంటసాల విగ్రహం వద్ద చైతన్య సమితి సభ్యు లు బుధవారం ఘంటసాల 102వ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు, చైతన్య ఆంధ్ర సమితి సభ్యులు వాసుదేవరావు, వెంకటేశ్వరరావు, ఎస్ఎన్ పండా, మురళీబెహరా పాల్గొన్నారు.

రబీలో పంటల బీమా చెల్లించాలి

మెళియాపుట్టి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రబీలో పండించిన పంటలకు పంటల బీమా చెల్లిం చాలని వ్యవసాయాధికారి దానకర్ణుడు తెలిపారు. బుధవారం బాణాపురం పంచాయతీలో రైతులతో సమావేశం నిర్వహించారు. మినుములు, పెసర, మొక్కజొన్న పంటలకు రైతులు బీమా చెల్లిస్తే ఉపయోగకరమన్నారు. ఆయనతో పాటు వీఏఏ లోకేష్ ఉన్నారు.

నగర వనం జంట పట్టణాలకు తలమానికం

పలాస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగర వనం నిర్మాణం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకే తలమానికమని జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త, రజక కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గారావు అన్నారు. ఈ మేరకు బుధవారం మెండు అటవీభూమి వద్ద నిర్మాణంలో ఉన్న నగరవనం పనులు పరిశీలించారు. నాయకులు కె.కృష్ణారావు, డి.వంశీకృష్ణ చౌదరి, ఎన్.ధర్మారావు పాల్గొన్నారు.

ఉలికిపాటుకు గురైన లింగాలవలస

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం లింగాలవలసలో పులి ఒకర్ని చంపిందంటూ సోషల్ మీడియాలో ఓ వీడియోతో పాటు ఫేక్ ప్రచారంతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలికిపడ్డారు. టెక్కలి, పాతపట్నం రేంజ్ పరిధిలో పెద్దపులి సంచరిస్తుం డడం, టెక్కలి మండలానికి పాతపట్నం, సారవకోట మండలాల సరిహద్దుల్లో ఉండడంతో ఈ వార్త నిజమేమోనని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు బంధువులను ఆరా తీశారు. బుధ వారం రోజంతా లింగాలవలస గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. ఎక్కడెక్కడి నుంచో వారికి ఫోన్ చేస్తూ ఏం జరిగిందని వారు అడగడం, ఇక్కడ ఏం జరగలేదని సమాధానం ఇవ్వడం గ్రామస్థుల వంతైంది. ఇది ఫేక్ ప్రచారం అని వారు చెప్పారు. గ్రామస్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. మరోవైపు రెవెన్యూ, అటవీశాఖ, ఇంటెలిజెన్స్ అధికారులు ఖంగుతిన్నారు. చివరికి ఫేక్ వీడియో అని తెలిసి బంధువులు, గ్రామస్థులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యానవన పంటలపై ఆసక్తి పెంచుకోండి

పలాసరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యాన వన పంటలపై ఆసక్తి పెంచుకోవాలని ఉద్యానవన శాఖాధికారి శంకర్ దాస్, వ్యవసాయాధికారి పోలారావు రైతులకు సూచించారు. బొడ్డపాడు గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీడి, మామిడి, పనస, మునగ, కొబ్బరి పంటల్లో సస్యరక్షణపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలపై ఆసక్తి కనబర్చాలని, అధిక ఆదాయం వచ్చే రకాలను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో బీహెచ్ఏ తెప్పల పావని, రైతులు పాల్గొన్నారు.

కాళింగుల సంక్షేమానికి కృషి

నరసన్నపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడి ఉన్న కాళింగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. పదవీ ప్రమాణం చేసిన తరువాత బుధవారం తొలిసారి ఆయన నరసన్నపేట వచ్చిన సందర్భంగా కాళింగ సంక్షేమ సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బలగ మురళి, మార్పు విజయ్‌కుమార్, ఉప్పాడ పూర్ణచంద్రరావు, సింగూరు శ్రీనివాసరావు, దానేటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ హౌసింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

పలాస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అర్బన్ హౌసింగ్ నిర్మాణదారుల సమస్యలు పరిష్కరిస్తామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కార్యాలయం ఆవరణలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణదారులకు సంబంధించి ఇసుక, బిల్లులు సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని, సంబంధిత హౌసింగ్ అధికా రులతో ఇప్పటికే మాట్లాడామన్నారు. గ్రీవెన్స్ లో 12 ఫిర్యాదులు వచ్చాయని, వీటిని కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుంద న్నారు. ఇళ్లకోసం డిపాజిట్ చేసిన నగదుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

పాతపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ గురు కులాల జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్ర మ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. మెనూ అమలు, భోజనాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రిన్సిపాళ్లు వి.అర్చన, బి.బుచ్చిరాజు, ఆర్వీ కృష్ణతార ఉన్నారు.

పనుల్లో పురోగతి సాధించాలి: ఎమ్మెల్యే బగ్గు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'పల్లె పండుగ'లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఎంపీడీవోలు, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. నాలుగు మండలాల్లో రోడ్లు, కాలువల నిర్మాణ పనుల్లో పురోగతి పెంచాలన్నారు. వారం రోజుల్లోగా పనులు మొదలపెట్టకుంటే కేటాయింపులు రద్దు చేసి అవసరమైన చోట ఆ నిధులను సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల ఎంపీడీవోలు మధుసూదనరావు, రవికుమార్, పీఆర్ డీఈఈ సత్యంనాయుడు, ఏఈ బగ్గు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

తర్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

సారవకోట(జలుమూరు) డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సారవకోట మండలం తొగిరి పంచాయతీ తర్లి గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని టీడీపీ నాయకుడు పిల్లా నందకిషోర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో పనులకు శంకుస్థాపన చేసినా ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో పనులు నిలిచిపోయా యన్నారు. దీంతో గ్రామానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు బోన జోగారావు, పిట్ట ఆదినారాయణ, పి.లచ్చుము, మండల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలు పంచుకునేందుకు వేదికలు దోహదం

● జేఎన్‌టీయూ డైరెక్టర్ (అకడమిక్) రాజేశ్వరరావు
● 'ఆదిత్య'లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ అకడమిక్ డైరెక్టర్ రాజేశ్వరరావు

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వివిధ అంశాలపై తమ ఆలోచనలను పంచుకునేందుకు ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయని జేఎన్‌టీయూ డైరెక్టర్ (అకడమిక్) ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు అన్నారు. స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఐటీ, రూర్కెలా, ఐతమ్ సౌజన్యంతో రెండురోజులు నిర్వహించనున్న 'ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్, ఇంటలిజెంట్ మాన్యుఫేక్చరింగ్ సిస్టమ్' పై అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ మేధస్సును రిజిస్ట్రేషన్ చేయడంలో అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలతో పోలి స్తే భారత్ వెనుకబడి ఉందన్నారు. కేవలం ఉద్యోగం లేదా ప్రమోషన్లకు తగ్గట్లుగా జర్నల్స్‌ను ప్రచురితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్‌లను సమాజంలో సమస్యలు పరిష్కారానికి వినియో గించుకోవాలని సూచించారు. ఒకరి వద్ద పనిచేసే వారిగా కాకుండా పది మందికి ఉద్యోగాలు ఇచ్చే వారిగా ఎదగాలన్నారు. డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రంగంలో రోబోలు ఆవశ్యకత పెరిగిందన్నారు. నేటి ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్ డేటా సైన్స్, సైబర్ సెక్యూర్టీ తదితర రంగాలకు అధిక ప్రాధాన్యం పెరిగిందని, వీటిపై నిరంతర పరిశోధనలు జరగాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై 156 మంది పేపర్ ప్రజెంటేషన్లు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, కన్వీనర్ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ శూన్యం

● రోడ్డు పనులపై కలమట అసంతృప్తి



పనులను పరిశీలిస్తున్న కలమట వెంకటరమణమూర్తి

మెళియాపుట్టి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో చేపడుతున్న ఐటీడీఏ పనులపై ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిధులు ఖర్చవుతున్నా పనులు కనిపించడం లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం 'మట్టిపూసి మాయ చేసి' శీర్షికతో వచ్చిన కథనంతో ఆయన అడ్డివాడ వద్ద పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికీ అధికారులు వైసీపీ పాలనలో ఉన్నామనుకుంటున్నారన్నారు. పనులు కాకుండా బిల్లులు చేయటం విచిత్రంగా ఉందన్నారు. దీనిపై సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ తామన్నారు. రోడ్డు పనులు మట్టి వేయడం ఎందకని ప్రశ్నిం చారు. ఆ సమయంలో గడ్డి లేకపోవడంతో మట్టి వేసినట్లు సంబంధిత కాంట్రాక్టర్ తెలిపారు. అయితే బుధవారం మట్టిని తొలగించి గడ్డి వేసి తడిపిం చడం కనిపించినట్లు తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడో, ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, శంకరరావు, జనసేన నాయకుడు దుక్క బాలరాజు తదితరులు ఉన్నారు.

ఐటీఐ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

పాతపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు రెండెకరాలు స్థలాన్ని ప్రహ రాజపాలెం సమీపంలో బుధవారం టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పరిశీలించారు. అలాగే బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి, షిర్డీగిరి సమీపంలో గిరిజన మార్కెట్, ప్రభుత్వ పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు స్థలాలనుపరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, మండల సర్వేయర్ రామ గణపతి, ఆర్ఐ బాబీ పండిట్ తదితరులున్నారు.

ఏకలవ్య విద్యార్థిని మృతిపై విచారణ

పాతపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య మోడల్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో బలవన్మరణం చెందిన విద్యార్థిని సవర లావణ్య మృతిపై టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి బుధవారం విచారణ చేపట్టారు. అక్టోబరు 17న లావణ్య మృతి చెందిన ఘటనపై అప్పటి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణితో పాటు సిబ్బంది, విద్యార్థినులను ఆయన విచారించారు. రికార్డులను, హాజరుపట్టికను పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ఉన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వీఆర్వోలు

పొందూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తోలాపి గ్రామ సచివాలయంలో కంప్యూటర్‌ను ధ్వంసం చేయడమే కాకుండా వీఆర్వో ఎం.దివాకర్ (రేవతిరావు)పై గ్రామస్థుడు దాడి చేయడంతో బుధవారం రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ వెంకటేష్ రామానుజు ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వీఆర్వోపై దాడి హేయ మని, బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కేసు పెట్టాలని కలెక్టర్ ఆదేశం

తోలాపి సచివాలయంలో వీఆర్వోపై దాడి చేయడమే కాకుండా కంప్యూటర్‌ను ధ్వంసం చేయడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ఎంపీడీవో మన్మథరావుపై కలెక్టర్ మండిపడ్డారు. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. దీంతో తోలాపి సచివాలయ కార్యదర్శి కూన వినోద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మందస, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మందస రైతు సేవా కేంద్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్.హైమావతి ప్రారంభించారు. ఎ-గ్రేడ్‌ను రూ.2320, కామన్ రకం రూ.2300లకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి తాతారావు, బి.భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు వి.మాధవరావు, కె.హేమారావు చౌదరి, జనసేన నాయకులు సంతోష్‌పండా, లోకేష్ పాల్గొన్నారు.

వంద రోజుల 'ఉపాధి' పని కల్పించాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 38 పంచాయతీల్లో 100 రోజులు పని కల్పించాలని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ అన్నారు. బుధవారం ఉపాధిహామీ పథకం సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన 88 నుంచి 99 రోజులు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో జి.హరిప్రసాద్, ఎస్ఆర్పీ తిరుపతిరావు, ఈసీ టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు వేయాలి

నరసన్నపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగునీరందించడం జరగదని, అందు వల్ల ఆరుతడి పంటలే వేయాలని వ్యవసాయాధికారి సునీత సూచించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రబీలో అపరాలు సాగు చేయాలని, అలాగే చెరువు వెనుక ప్రాంతాల్లో వేరుశనగ, సన్‌ఫ్లవర్ సాగు చేయడం ఉత్తమమన్నారు. అనంతరం రైతులకు మట్టి నమునా పరీక్షల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వీఏవో హారిక తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకు నాస్ పరీక్షలు

నరసన్నపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు. బుధవారం పట్టణంలో పలు పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షలను పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం మదింపునకు ఈ పరీక్షలు దోహదం చేస్తాయన్నారు. పలు పాఠశాలలో ఎండీఎంను పరిశీలించారు.

వీఆర్వోపై దాడి దారుణం

నరసన్నపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పొందూరు మండలం తోలాపి గ్రామ సచివాలయంలో వీఆర్వో ఎం.దివాకర్‌పై గ్రామస్థుడు భౌతికదాడి చేయడం దారుణమని వీఆర్వో సంఘ రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడిపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

● పలాసరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పొందూరు మండలం తోలాపి వీఆర్వో దివాకర్‌పై జరిగిన దాడి అమానుషమని వీఆర్వోల సంఘ నాయకులు కంచరాన ఖగేశ్వరరావు, కె.శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై భౌతిక దాడికి దిగడాన్ని ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, మరలా ఇటువంటి పునరావృతం కాకుండా చూడా లని కోరారు.

117 జీవోను రద్దు చేయాలి

జలుమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. జలుమూరు మండలంలో పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం 117జీవోను రద్దు చేయాలని, పనివేళలు మార్పు సరైనది కాదన్నారు. డీఏ, సరెండర్ లీవు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి, సంఘం మండల అధ్యక్షుడు మెండ రామారావు, అనెం శ్రీనివాసరావు, బి.సింహాచలం, పి.చంద్రభూషణ్ నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు దరఖాస్తులు

నందిగాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఓటరుగా నమోదుకు ఈనెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్.రామారావు తెలిపారు. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు సర్వీసు సర్టిఫికేట్‌ను దరఖాస్తుకు జతచేసి ఆరోజు సాయంత్రం 5 గంటలలోగా తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని ఆయన కోరారు.

మాదక ద్రవ్యాలకు గురికాకుండా చూడాలి

హిరమండలం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా చూడాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు వయ సున్న సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాదరావు, ఐసీ డీఎస్ పీవో విమల కుమారి, వైద్యాధికారి సాయిగీతిక, ఎంఈవో కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.